# పెళ్ళంటే తలంబ్రాలు



మేము ఇల్లు కట్టుకున్న రెండు మూడేళ్ళకి చిన్నారీ వాళ్ళు కూడా మా ఇంటి వెనక వీధిలో స్థలం కొనుక్కున్నారు. చక్కటి ఇనప్పెట్టెలాంటి ఇల్లు కట్టుకున్నారు. ఇల్లు కట్టించేటప్పుడు చిన్నారి పొద్దున్నే వచ్చి మా ఇల్లు హెడ్ క్వార్టరుగా పెట్టుకుని అక్కడి పనులు చేయించేది. సరిగ్గా నాలుగు నెలల్లో ఇల్లు పూర్తి చేసి గృహప్రవేశమయ్యారు. వాళ్ళ గృహప్రవేశం ఆహ్వాన పత్రికలన్నీటినీ మా శైలు చిన్న ఇల్లు బొమ్మ చుట్టూ తోటా వేసి చేత్తో రాసింది. రెండు వందల కార్డులు ఓపిగ్గా చేసింది. ఆ విధంగా మేమిద్దరం పక్కపక్కనే ఇళ్ళు కట్టుకుని వుందామని చిన్నప్పుడే

పరస్పరం చేసుకున్న వాగ్దానాల్ని నిజం చేసుకున్నాం, అలా ఎన్నో పుట్టినరోజులు, వేడుకలు, సంబరాలు, పెళ్ళిళ్ళు పేరంటాళ్ళ మధ్య మా ఇద్దరి పిల్లలూ పెరిగి బుద్ధిగా చదువుకుని ప్రయోజకులయ్యారు. ఆ రోజులలో మా ఇంట్లో జరిగిన అనేకానేక సందళ్ళ మధ్య మా వాళ్ళు ఆ మాత్రం సాధించారంటే గొప్ప విషయమే. అప్పుడప్పుడు మా చెల్లెళ్ళు "ఈ సుశీలనొక కంట కనిపెట్టుకునుండండే! ఎక్కడో ఏదో నెత్తిన పెట్టుకు వచ్చి మన చేత గొడ్డు చాకిరీ చేయించేస్తుందీ!" అని ఒకరికొకరు జాగ్రత్తలు చెప్పుకునేవారు. ఎవరెన్ని జాగ్రత్తలు చెప్పుకున్నా జరగాల్సినవి జరుగుతూనే వుండేవి. కానీ కాలప్రవాహంలో పిల్లలు పెద్దవుతారు. పెద్దలు వృద్ధులవుతారు. వృద్ధులు తప్పుకుంటారు. అందువల్ల మన జీవనశైలిలో కూడా మనకు తెలియకుండానే మన ప్రమేయం లేకుండానే ఎన్నో మార్పులు వచ్చేస్తాయి. నాక్కూడా కాస్త ఓపిక తగ్గి నిదానించాను. మా అమ్మాయి శైలుకీ, ఆ తరువాత నాలుగేళ్ళకి చిన్నారి కూతురు అరుణకీ పెళ్ళిళ్ళయి అమెరికాలోని అత్తారింటికి వెళ్ళిపోయారు. ఇంకో సంవత్సరం తిరిగేటప్పటికి మా చిన్నారి, వాళ్ళాయన వాళ్ళ వాళ్ళ వుద్యోగాలకి ఆర్నెల్లు సెలవు పెట్టి అమెరికా వెళ్ళారు పుట్టబోయే మనవరాలికి స్వాగతం పలకడానికి.

అప్పుడు మా ఇంటికి ట్రాన్స్ఫరయింది – చిన్నారి వాళ్ళ ఇంట్లో నాలుగేళ్ళుగా అన్ని పనులు చేసిపెట్టే భారతి అనే అమ్మాయి. ఆ పేరంటేనే నాకు చాలా ఇష్టం. మా ఇంటికి వచ్చేటప్పటికి దానికి పదహారేళ్ళుంటాయేమో. మంచి ఆరోగ్యంగా, పొట్టిగా స్ట్రాంగ్ గా వుండేది, చిన్నారి పెంపకం కదా! ఒకసారి వినాయక చవితి నాడు వాళ్ళింటికి వెళ్ళాను. పెద్ద కంచం నిండా పులిహోర, నాలుగయిదు ఉండ్రాళ్ళు, పరవాన్నం భారతి ముందు పెట్టి "తిను! లేకపోతే ఊరుకోను" అని ఇది గదమాయించడం నాకంట పడింది. అదేమో గుడ్లు మిటకరిస్తోంది. "అదేవిటే! అన్నన్ని ఒక్కసారి పెడితే చిన్నపిల్ల ఎలా తింటుందే" అని కేకలేశాను. "తినాలి! లేకపోతే బలం ఎలా వస్తుంది? పొద్దున్నించి పూజ అని చెప్పి ఏమీ తినలేదు" అని నాకు సమాధానం చెప్పింది. అలా వుండేది దాని పాలన పోషణ.

భారతి అమ్మా వాళ్ళది మహబూబ్‌నగర్ దగ్గిర చిన్న పల్లెటూరు. వాళ్ళకి నాలుగెకరాల వ్యవసాయం. కానీ, అక్కడ ఎప్పుడూ కరువులే. వాళ్ళకి ముగ్గురు ఆడపిల్లలు. ఆ తరువాత నలుగురు మగ పిల్లలు. ఆడపిల్లలిద్దరిని హైదరాబాదు తీసుకువచ్చి పెద్దది వెంకటమ్మని ప్లీడరుగారింట్లో పిల్లల్నెత్తుకోడానికీ, రెండోది భారతిని చిన్నారింట్లోనూ పనికి పెట్టి వాళ్ళ వూరు వెళ్ళిపోయారు. ఆ తరువాత వెంకటమ్మ వాళ్ళ వూరు వెళ్ళిపోయింది గానీ, భారతి మాత్రం చిన్నారింట్లో స్థిరపడిపోయింది. అది మహా ఘటికురాలు. చాలా చురుకు. ఏ పనయినా క్షణాల మీద చేసేది.

దానికెలాగయినా నాలుగక్షరం ముక్కలు నేర్పాలని ఉపాధ్యాయ వృత్తిలో వున్న మా చెల్లెలు నానా తంటాలూ పడేది.కానీ, పుస్తకం కంటపడగానే అది గట్టిగా ఆవలించి పడుకునేది. కారు టైర్లు మార్చడం, ఫ్యూజులేయడం కూడా అవలీలగా చేసే పిల్ల అక్షరం చూసి ఎందుకు జడుసుకుంటుందో అర్థం అయేది కాదు. దానికి రాని పనంటూ లేదు. పని చేసేందుకు బద్ధకమూ లేదు. పనిమంతురాలిననే పొగరుకీ తక్కువ లేదు.

భారతి మా ఇంటికి వచ్చిన సమయానికి మా అత్తగారు ఓపిగ్గానే వున్నారు. వంటకోసం పనివాళ్ళమీద ఆధారపడే వాళ్ళం కాదు. అప్పటికి మాకు కూడా కాస్త కష్టం సుఖం వంట పట్టి అనవసరపు హడావిడులు తగ్గించుకున్నాం. నేను ఫాక్టరీ పనులలో బిజీగా వుండేదాన్ని. అమ్మకాలం చేశాక మాకు బంధువుల రాకపోకలు తగ్గాయి. కోడలు యూనివర్సిటీలో చదువుకునేది. ఇల్లంతా డిసిప్లిన్డుగా వుండేది. అప్పుడు ఇంటి పెత్తనమంతా భారతిదే! బజారుకెళ్ళి కూరలు, సరుకులు తేవడం, ఇల్లు శుభ్రంగా వుంచడం, గిన్నెలు తోమడం వగైరా పనులన్నీ చక్కగా చేసేది. ఇంటికెవరయినా గెస్టులొస్తే కాఫీలు కోసం విడిగా వుంచిన స్టౌ మీద కాఫీ, టీ లు కలిపి ఇచ్చేది. అమెరికాలో వున్న మా అమ్మాయికి ఫోన్ చేసి "నీకేం కావాలమ్మా! ఏం పంపమంటావ్" అనడిగితే, "నాకేం వద్దమ్మా! చేతనయితే భారతిని పంపు" అనేది.

ఇలా ఒక ఏడాది గడిచాక దాని వాలకంలో కొద్దిపాటి మార్పులు కనిపెట్టాను. అస్తమానం సినిమా బొమ్మలు, పుస్తకాలు చూసుకుంటూ వుండడం, ఏ పని చెప్పినా సగం సగం చేయడం, పరధ్యానంగా వుండడం గమనించాను. ఈ వయసులో వున్న పిల్లల్ని కాసుకోవడం ఎంత కష్టమో నాకు తెలుసు. అందులో వాళ్ళు పల్లెటూరి వాళ్ళు. ఏ కాస్త తేడా వచ్చినా మననే బాధ్యుల్ని చేస్తారు. నాకు భయం వేసి వాళ్ళ అమ్మా వాళ్ళకి కబురు పెట్టి రప్పించాను. "పిల్ల పెద్దదవుతోంది. నేను రోజంతా ఇంట్లో వుండను. మీ అమ్మాయికి పెళ్ళి సంబంధాలు చూడండి. ఏదైనా కుదిరితే పెళ్ళి చేసేద్దాం. తక్కువ పడితే నేను సద్దుతాన"ని చాలా బాధ్యతగా మర్యాదగా చెప్పాను.

"చూస్తమమ్మా. మొన్ననేగా పెద్దామెకి లగ్గం చేసినం. ఈ సంవత్సరం కూడ గింజలు చేతికిరాలే. బిడ్డని జాగ్రత్తగా చూసుకో. మేం గూడ పిలగాని కోసం దేవులాడతాం" అని మళ్ళీ ఆ బాధ్యత నాకే అప్పజెప్పి "భద్రం బిడ్డా! బయటకేడికీ పోబాకు! అమ్మ చెప్పినట్లు వినుకుంటు మంచిగుండు" అని దానికి జాగ్రత్తలు చెప్పి

వెళ్ళిపోయారు.

మా ఇంట్లో ఒక చిన్న తోట లాంటిది వుండేది. పెద్ద గొప్పగా వుండదు గానీ ఒక మాదిరి లాన్ కూడా వుండేది. ఆ లాన్‌లో ఒక వుయ్యాల, లాన్ చుట్టూ మంచి పూలచెట్లు రోజుకు శేరు పూలు జాజులో, మల్లెలో పూసేవి. చాలా రకాల మందారపూలు కూడా పూసేవి. మా దేవుడు రంగురంగుల మందారపూల మధ్య రోజుకొకలాగా కనిపించేవాడు. ఇప్పుడేవిటో ఎంత సేవ చేసినా చెట్లు అలా పూయడం లేదు. మామిడి చెట్లు బాగా పెద్దవైపోయి అన్ని పూలమొక్కల్ని కమ్మేయడంతో పూత తగ్గిపోయింది. మళ్ళీ ఏదో వుపాయం ఆలోచించాలి. అప్పట్లో రాములు అనే మాలి ఒకతను మా ఇంటికి వచ్చి శనాదివారాలు తోట పని చేసేవాడు. అతను గవర్నమెంటు ఆఫీసులో కూడా మాలీనే. చాలా నిదానస్తుడు. అతని భార్య సనత్‌నగర్‌లో ఏదో ఫాక్టరీలో పాకింగ్ సూపర్‌వైజర్‌గా పని చేసేది. వాళ్ళకి నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు సంతానం. అందులో ఇద్దరు కొడుకులు పెళ్ళికున్నారు. అతను పనికి వచ్చినపుడు భారతి అతని కూడానే వుండేది. రైతు బిడ్డ అవడం వల్ల దీనికి మొక్కల పనులు బాగానే వచ్చు. అతనికి రెండు సార్లు టీ పెట్టి ఇచ్చేది. భోజనం చేసే టైములో ఏదో కూరో, పచ్చడో వేసేది.పక్కనే కూచుని వాళ్ళ వూరి కబుర్లన్నీ చెప్పేది.

ఒకరోజు మాలి నాతో మాట్లాడుతూ, “అమ్మా! ఈ పిల్లకి పెళ్ళి చేస్తడా వాళ్ళ నాయన?” అనడిగాడు. “చేయాలెగదా! కానీ వాళ్ళకి పంట గింజలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఎందుకడుగుతున్నావ్?” అన్నాను.

“ఏమీ లేదమ్మా! నా కొడుకింటికాడనే వుంటున్నడు. పదవ తరగతి దాక చదివిండు గాని దోస్తులతో తిరిగి పరేషాన్ చేస్తున్నడు. పెండ్లయి భార్య వస్తే కుదురుకుంటడేమోనని అనుకుంటున్నం. ఆయనకిస్తే చేసుకుంటం” అన్నాడు. పిల్లవాడ్ని తీసుకురా! ఒకసారి చూస్తానంటే ఒకరోజు తీసుకువచ్చాడు. చూడ్డానికి లక్షణంగా వున్నాడు. మంచి రంగు, ఒడ్డు పొడుగు బాగున్నాడు. నేనేదో రెండు ప్రశ్నలేశాను. వుద్యోగమొస్తే చేద్దామనుకుంటున్నాననీ, ప్రయత్నాలు చేస్తున్నాననీ చెప్పాడు. అతన్ని భారతికి్కూడా చూపించాను. అమ్మావాళ్ళని పిలిపించనా అని అడిగితే ‘నీ ఇష్టం’ అంది.

సరే అని ఇక నేను నా ప్రయత్నాలు మొదలుపెట్టాను. వుత్తరం రాస్తే వాళ్ళ అమ్మా నాన్నా నెల్లాళ్ళ తర్వాత వచ్చారు. ఇట్లా సంబంధం వుందని వివరాలన్నీ చెప్పాను. భారతి తండ్రికి రాములుతో మంచి పరిచయమే వుంది. అతను మా యింటికి వచ్చినపుడు చెట్టు కింద కూచుని ఇద్దరూ కష్ట సుఖాలు మాట్లాడుకునేవారు.

భారతి తల్లీదండ్రీ రాములింటికి వెళ్ళి ఇల్లూ వాకిలీ చూశారు. పిల్లాడ్ని చూశారు. ఇంట్లో వాళ్ళందరినీ కలిశారు. సంతోషంగానే ఇంటికి వచ్చారు.

నేను ఎప్పుడయినా సంబంధం చూపిస్తాగానీ పరాయి వాళ్ళ విషయాలు, కట్నకానుకలు మాట్లాడుకోడం, నచ్చచెప్పుకోవడం లాంటి వాటిల్లో జోక్యం చేసుకోను. పెళ్ళయినా, ఉద్యోగమయినా, వ్యాపారమయినా ఇరుపక్షాలకీ లాభదాయకంగా వుంటేగానీ కుదరవు. ఇంక పిల్లవాడి చరిత్ర విషయంలో కూడా బాధ్యత తీసుకోను. అది ఎవరికి వారే జాగ్రత్తగా కనుక్కోవాలి. బయటకెడితే మన పిల్లలెలా వుంటారో మనకి తెలియదు. కాబట్టి బయట వాళ్ళ గురించి ఎవరికయినా ఎలా చెప్పగలుగుతాం! ఆ విషయంలో జాగ్రత్త తీసుకోవలసినది పిల్లనిచ్చుకునేవాళ్ళే. "మీరు అన్నీ జాగ్రత్తగా విచారించుకోండి. ఆలోచించుకోండి. అప్పుడు చూద్దాం. ఏదైనా తేడా పాడాలొస్తే అమ్మ చేసిందని నన్ను అనద్దు" అని చెప్పాను. పైగా "తొందరపడకండి. ఇంకా కొన్నాళ్ళు చూద్దాం. మధ్యమధ్యలో ఆయన్ని కలుస్తూ వుండండి. పిల్లవాడు ఉద్యోగంలో చేరేదాకా ఆగుదాం" అని సలహా కూడా ఇచ్చాను. నెమ్మదిగా రోజులు గడిచాయి. అతనికి ఏదో కంపెనీలో చిన్న వుద్యోగం వచ్చింది. సనత్‌నగర్లో కంపెనీలకేం తక్కువ. వుద్యోగాలు రానూ వస్తాయి. పోనూ పోతాయి.

పిల్లవాడికి ఉద్యోగం వచ్చిందని తెలిశాక ఆడపెళ్ళివారు వాళ్ళని పిల్లని చూసుకోవడానికి రమ్మని ఆహ్వానించారు. ఒక ఆదివారం సాయంత్రం అల్లుళ్ళు, కొడుకులు, కోడళ్ళు మనవలతో సహా కుటుంబమంతా పిల్లని చూసుకోవడానికి వచ్చారు. మేము మా పోర్టికోలో జంపఖానాలు పరిచి కుర్చీలు వేయించి, స్వీట్‌షాపు నుంచి సమోసాలు జిలేబి తెప్పించి తగు మర్యాదలు చేసాం. భారతి అందరికీ టీ పెట్టి ఇచ్చింది. రెండు రోజులాగి భారతి తల్లీతండ్రీ, వెళ్ళి అన్నీ మాట్లాడుకుని వచ్చారు. పెళ్ళికొడుక్కి తులం బంగారం, రెండు జతల బట్టలు, సైకిలు, వాచి, మంచాలు, బీరువా, ఫాను ఇవ్వాలి. ఆ ఇంటి పెద్దలకి బట్టలు పెట్టాలి. ఆడపడుచులు ముగ్గురికీ మూడువేలివ్వాలి. వాళ్ళు పిల్లకి రెండు తులాల బంగారం, రెండు పట్టుచీరలు పెడతారట. ఎంత తక్కువలో తక్కువగా అనుకున్నా వాళ్ళకివ్వవలసిన దానికి ఇరవైవేలూ, పెళ్ళి ఖర్చుకి పదివేలూ అవుతాయి. వాళ్ళ నాన్న ఇరవైవేలు తెస్తానన్నాడు. నేను పదివేలిస్తానన్నాను. ఇంకా తక్కువ పడితే దాని జీతండబ్బులు నాలుగువేలు నా దగ్గర వున్నాయి.

మళ్ళీ పదిరోజుల తర్వాత పెళ్ళివారి కుటుంబం మరికొంతమంది చుట్టాలతో సహా వచ్చారు. అయిదు రకాల పువ్వులు, పళ్ళు, ఒక చీర, వుంగరం తెచ్చారు.

భారతి వాళ్ళ నాన్న వాళ్ళ పద్ధతిగా దావత్ ఏర్పాటు చేసాడు. ఇంక నేను అటుపక్కకి పోలేదు నన్ను చూస్తే మొహమాటపడతారని. అంతా అయ్యాక వెళ్ళిపోతుండగా రాములు భార్య లోపలికి వచ్చి నాకు బొట్టుపెట్టి తాంబూలమిచ్చి 'చిన్నమెత్తు బంగారం పెట్టి పిల్ల మాదనిపించుకున్నమమ్మా' అని చెప్పింది. అప్పుడే పంతులాయన వచ్చి పెళ్ళికి ముహూర్తం కూడా పెట్టాడుట.

మా ఇంటి వెనకాలే అమ్మవారి గుడి వుంది. ఆ గుడిలో ఏడుగురు దేవతలుంటారు. అందుకే మా వాడని "ఏడుగుళ్ళు" అని పిలుస్తారు. ఆ గుడి ఆవరణ చాలా పెద్దది. గుడి కమిటీకి వెయ్యి నూటపదహార్లిస్తే, అక్కడ పెళ్ళి చేసుకోవచ్చు. అక్కడయితే మనకి అన్నివిధాలా అందుబాటులో వుంటుందని ఆ డబ్బు కట్టి ఖాయం చేసుకున్నాం. మా ఫాక్టరీలో మల్లేశ్ అనే అతను నైట్‌వాచ్‌మన్‌గా పని చేసేవాడు. అతను అంతకు ముందు ఆర్మీలో వంటవాడిగా పనిచేశాడుట. భారతి పెళ్ళికి తనే వంట చేస్తానని, గిన్నెలు సరుకులు అన్నీ తను ఏర్పాటు చేసుకుంటాననీ చెప్పాడు. అమ్మయ్య భోజనాల విషయంలో బాధ్యత తీసుకునే వాడొకడు దొరికాడు కదా అని సంతోషించాను. పెళ్ళంటే మరి మనలాంటి వాళ్ళకి బోనాలే కదా! సుమారు నూటేభైమంది దాకా అవుతారని చెప్పాను. దానికి తగ్గ ప్రయత్నాల్లో తలమునకలయ్యాడు.

ఆ రోజుల్లో నేను లయన్స్‌క్లబ్బులో చురుగ్గా పనిచేసేదాన్ని. భారతి వాళ్ళందరికీ బాగా తెలుసు. దానికి పెళ్ళని తెలియగానే మా క్లబ్బు వాళ్ళంతా చాలా సంతోషించారు. తలా రెండువందలూ వేసుకుని వంటింటికి కావల్సిన స్టీలు గిన్నెలు, డబ్బాలు, కంచాలు, గ్లాసులు, రెండు స్టీలు బిందెలు, బేసిన్లు కొని పెళ్ళికానుకగా ఇచ్చారు. మర్నాడు పెళ్ళనగా వాళ్ళ అమ్మానాన్నా, తమ్ముళ్ళూ, మేనత్తలూ, ఇతర బంధువులూ ఒక పాతికమంది దాకా వచ్చారు. నేను తెలంగాణాలో చాలా కుటుంబాలని చూశాను. పెళ్ళంటే మనలాగా గందరగోళం పడరు. చాలా నిదానంగా తాపీగా పనులు చేస్తారు. వంటలతో సహా అన్నీ మగవాళ్ళే చూసుకుంటారు. ఆ విషయం ముఖ్యంగా నాకు నిజంగా ఆశ్చర్యం కలిగించే విషయమే.

ఊరి నుంచి వచ్చిన ఆడపెళ్ళివారందరూ వెళ్ళి గుడి అంతా శుభ్రం చేసారు. మంచి మండపం తయారు చేసారు. మా కొబ్బరి చెట్లు, మామిడి చెట్టూ కూడా తమవంతు సాయం చేశాయి. మర్నాడు వుదయం మగపెళ్ళివారు అరవై డెబ్బైమంది తొమ్మిదికల్లా వచ్చారు. పంతులుగార్ని వాళ్ళే తీసుకుని వచ్చారు. చిన్న డోలూ, సన్నాయి వాయిద్యం పెట్టి పెళ్ళి కూతుర్ని మండపానికి వూరేగింపుతో తీసుకుని వెళ్ళారు. ఇప్పుడు కొత్త సమస్య వచ్చింది. పెళ్ళి వారిని పిల్ల తల్లి వచ్చి పలకరించాలి కదా! కానీ ఏ వేళ్టికీ అది రాదే! వెంకటమ్మ కూడా మూడునెల్ల కూతుర్ని వళ్ళో

వేసుకుని ఒక చెట్టుకింద కూచుని వుంది. నాకేం అర్థం కాలేదు. 'ఎందుకలా కూచున్నావని అడిగితే మాకేమీ సరిగా మర్యాదలు జరగలేదని కచ్చితంగా చెప్పింది. తరువాత తెల్సింది వాళ్ళ ఇళ్ళల్లో ఆడపెళ్ళివారిదే పై చేయిట. పిల్లతల్లికి చాలా లాంఛనాలు జరపాలట. ఏదో ఇదీ బాగానే వుందే అని సంతోషించాను. వాళ్ళనలా వదిలేసి పెళ్ళిపనులన్నీ నేనే చూశాను. వాళ్ళ నాన్న మాత్రం నా వెనకాలే తిరుగుతూ అన్నీ చేయించాడు.

మల్లేష్ వంట అద్భుతంగా చేసాడు. ఇప్పటి వరకు నేను నా జీవితంలో కనీసం ఒక వెయ్యన్నా పెళ్ళి భోజనాలు చేసివుంటాను. కానీ ఆ రోజున నేను చేసినంత కమ్మటి భోజనం ఎప్పుడూ ఎక్కడా దొరకలేదు. అసలు కిటుకేమిటంటే మెనూ సింపుల్‌గా వుండాలి. అక్కడ మన మెదడుకి పరీక్షపెట్టి ఓడిపోయేలా వుండకూడదు. వంట వేడిగా వుండాలి. మనం పడీ పడీ మర్యాదలు చేయాల్సిన అతిథులుండకూడదు. అంతా మనవాళ్ళే. మనలాటి వాళ్ళే వుండాలి. అప్పుడే మనం భోజనాన్ని వైనంగా ఆస్వాదించగల్గుతాం. వంట ఘుమఘుమలాడిపోయింది. పులావు, బగారాబాంగను, పాలకూరపప్పు, అన్నం, టామాట పచ్చడి చారు వాటిపైన కారంబూందీ చివరికి చిన్నలడ్డు. ఇంకేం కావాలి? మా ఫ్రెండ్సంతా కూచుని హాపీగా తాపీగా తిన్నాం.

పెళ్ళి హడావిడి అంతా అయేటప్పటికి నాలుగయింది. అప్పగింతలయ్యాక వాళ్ళూ వీళ్ళూ ఒడిబియ్యం పోసుకున్నారు. పనిలో పనిగా నన్నూ కూచోబెట్టి నాక్కూడా బోలెడు బియ్యం పోశారు. వాళ్ళకి ఇంకో ఆచారం వుంది. పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయే పెళ్ళికూతురు తల్లిగారింట్లో కల్లుకుండ పెట్టి నిండా కల్లు పోస్తుందట. తల్లిగారింట్లో రోజూ కల్లుపొంగాలని అంటే సంతోషాలు పండాలని కోరుతుందన్న మాట. నేను వద్దంటున్నా వినకుండా మా ఇంట్లో కల్లుకుండ పెట్టే వెళ్ళారు. నిజం చెప్పాలంటే మా ఇంట్లో ఆ సమస్య ఎప్పుడూ లేదు. సరే వాళ్ళ ముచ్చట కాదనడం ఎందుకు?

ఈ పెళ్ళి జరిగి ఇప్పటికి ఇరవై సంవత్సరాలయింది. భారతి వాళ్ళ అత్తగారు చేసిన కంపెనీలోనే పని చేస్తోంది. దాని కూతురు, కొడుకూ బాగానే చదువుకుంటున్నారు. వాళ్ళాయన అప్పుడప్పుడు ఏదైనా పనిచేస్తాడు. మావగారు ఇంటిని నాలుగుఫ్లాట్లుగా మార్చి ఈ కోడలికి అందరికన్నా మంచి ఫ్లాటు ఇచ్చాడు. అది అప్పుడప్పుడు వచ్చి అక్కని చూసి వెడుతూ వుంటుంది. ఏదో కాలం అలా అలా గడిచిపోతోంది.

✤